కాంగ్రెస్‌లో ఖర్గే X అధీర్

తృణమూల్‌పై ఇద్దరి మధ్య విభేదాలు

కోల్‌కతా, మే 19: లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమికి బయటి నుంచి మద్దతు ఇస్తామని తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించడంపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పశ్చిమ బెంగాల్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి మధ్య విభేదాలు తలెత్తాయి. మమత మద్దతు తీసుకోవాలా వద్దా అనేది పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని, అధీర్ కాదని ఖర్గే వ్యాఖ్యానించారు. దీనిపై అధీర్ స్పందిస్తూ.. మమత అవకాశవాద రాజకీయ నాయకురాలని.. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అంతం చేయడమే ఆమె లక్ష్యమని అన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కోల్‌కతాలో పలుచోట్ల ఖర్గే పోస్టర్లపై గుర్తు తెలియని వ్యక్తులు ఇంకు చల్లి.. 'ఖర్గే తృణమూల్ ఏజెంట్' అని రాశారు. ఈ ఘటనను అధీర్ ఖండించారు.

నేడే ఐదో విడత

- 49 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు
- బరిలో రాహుల్‌గాంధీ, స్మృతి ఇరానీ, రాజ్‌నాథ్, గోయల్ తదితర ప్రముఖులు
- ఒడిశాలో 35 అసెంబ్లీ సీట్లకూ పోలింగ్

న్యూఢిల్లీ, మే 19: సార్వత్రిక ఎన్నికల ఐదో దశ పోలింగ్ సోమవారం జరగనుంది. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, పీయూష్ గోయల్, సాధ్వి నిరంజన్ జ్యోతి, జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సహా పలువురు కీలక నాయకులు ఈ విడతలో పోటీపడుతున్నారు. మొత్తం 94,732 పోలింగ్ స్టేషన్‌లలో 8.95 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ 49 స్థానాల్లో 40 స్థానాలు ఎన్డీయే సిట్టింగ్ స్థానాలు కావడంతో బీజేపీకి ఈ దశ చాలా కీలకంగా మారింది.

యూపీలో కాంగ్రెస్‌కు అసలైన పరీక్ష

ఉత్తరప్రదేశ్‌లోని 14 స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగుతుంది. ఇందులో రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న రాయ్‌బరేలీ, స్మృతి ఇరానీ పోటీ చేస్తున్న అమేథీ, రాజ్‌నాథ్ సింగ్ పోటీ చేస్తున్న లక్నో స్థానాలు ఉన్నాయి. కేంద్ర మంత్రులు కౌశల్ కిశోర్(మోహన్‌లాల్ గంజ్), సాధ్వి నిరంజన్ జ్యోతి(ఫతేహ్‌పూర్), భానుప్రతాప్ సింగ్ వర్మ(జలౌన్) కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాంగ్రెస్ యూపీలో ఇప్పటికీ బలంగా కనిపిస్తున్న రాయ్‌బరేలీ, అమేథీ స్థానాల్లో ఫలితాలపై అందరి ఆసక్తి నెలకొంది.

ఆర్థిక రాజధానిలో అధిపత్యం ఎవరిది?

మహారాష్ట్రలోని 13 స్థానాలకు ఐదో దశలో పోలింగ్ జరగనుంది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలోని పది స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్(ముంబై ఉత్తర), భారతి పవార్(దిండోరి), కపిల్ పాటిల్(భీవండి) బరిలో ఉన్నారు. మహారాష్ట్ర సీఎం షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే మరోసారి కల్యాణ్ నుంచి పోటీచేస్తున్నారు. శివసేన, ఎన్సీపీలో చీలిక నేపథ్యంలో ఈ ఎన్నికలు కీలకంగా మారాయి.

బీహార్‌లో ఐదు.. జార్ఖండ్‌లో 3 స్థానాలకు

ఎన్డీయేకు గట్టి పోటీ ఎదురవుతున్న బీహార్‌లోని ముజఫర్‌పూర్, మధుబని, సీతామర్హి, సరన్, హాజీపూర్ స్థానాలకు ఈ దశలో పోలింగ్ జరగనుంది. హాజీపూర్ నుంచి లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్, సరన్ నుంచి ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య, మాజీ కేంద్రమంత్రి రాజీవ్ ప్రతాప్ రూడి బరిలో ఉన్నారు. మరోవైపు జార్ఖండ్‌లోని గోండే శాసనసభ సీటుకు ఉప ఎన్నికకు సోమవారం పోలింగ్ జరుగనుంది. గోండే నుంచి మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ భార్య కల్పనా సొరేన్ పోటీ చేస్తున్నారు.

- ఒడిశాలోని అస్క, కంధమల్, బార్‌గర్హ్, బొలంగిర్, సుందర్‌గర్హ్ లోక్‌సభ స్థానాలకు 35 అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. సీఎం నవీన్ పట్నాయక్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారు.
- తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ ఉన్న పశ్చిమ బెంగాల్ దక్షిణ ప్రాంతంలోని హౌరా, హుగ్లి, సెరంపోర్, బర్రాక్‌పోర్, ఉలుబేరియా, ఆరాంబాగ్, బన్‌గాం స్థానాలకు పోలింగ్ జరగనుంది.
- జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా కీలక ఎన్నికల పోరు జరగనుంది. బారాముల్లా నియోజకవర్గం నుంచి మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నుంచి బరిలో ఉన్నారు. ఆయనకు పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజ్జద్ గట్టి పోటీ ఇస్తున్నారు.

ఆప్ ఆఫీసు నుంచి బీజేపీ ఆఫీసుకు మార్చ్‌గా వెళుతున్న కేజ్రీవాల్

బీజేపీ 'ఆపరేషన్ చీపురు'

- ఆప్ అంతానికి కమలం పార్టీ కుట్ర: కేజ్రీవాల్
- బీజేపీ ఆఫీస్‌కు ఆప్ మార్చ్.. అడ్డుకొన్న పోలీసులు

న్యూఢిల్లీ: కేంద్రంలోని అధికార బీజేపీ, ప్రధాని మోదీపై ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీకి ఆప్ ఒక సవాల్‌గా మారిందని, అందుకే తమ పార్టీని అణచివేసేందుకు, ఆప్ అగ్రనేతలను అరెస్టు చేయించి, జైలుకు పంపేందుకు 'ఆపరేషన్ ఝాడు' చేపట్టిందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో ఆప్ ఎదుగుదలను చూసి బీజేపీ భయపడుతున్నదని, ఈ నేపథ్యంలో తమ పార్టీని నిర్వీర్యం చేసేందుకు పార్టీ నేతలను అరెస్టులు చేయిస్తున్నదని అన్నారు. తన వ్యక్తిగత సహాయకుడు బిభవ్ అరెస్టుకు నిరసనగా ఆది వారం ఆయన ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయానికి మార్చ్ చేపట్టారు. అనుమతి లేదంటూ మార్చ్‌ను పోలీసులు మధ్యలోనే అడ్డుకొన్నారు. పలువురు ఆప్ నేతలు, కార్యకర్తలను అరెస్టు చేశారు. దీంతో కేజ్రీవాల్ అక్కడ పార్టీ నాయకులతో కలిసి బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం తిరిగి ఆప్ కార్యాలయానికి చేరుకొన్నారు.

భవిష్యత్తులో ఇంకా పెద్ద సవాళ్లు!

మార్చ్ ప్రారంభానికి ముందు కేజ్రీవాల్ పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తుల్లో ఇంకా పెద్ద సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నదని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ''వేగంగా ఎదుగుతున్న ఆప్‌ను చూసి ప్రధాని మోదీ ఆందోళన చెందుతున్నారు. అందుకే మన పార్టీని అణచివేసేందుకు 'ఆపరేషన్ ఝాడు' ప్రారంభించారు. రాబోవు రోజుల్లో మన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతోపాటు మన పార్టీ కార్యాలయాన్ని లాగేసుకొని రోడ్డున పడేసే ప్రయత్నం చేస్తారు' అని పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం పాలసీలో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారని, అయితే దర్యాప్తు సంస్థల సోదాల్లో 100 రూపాయలు కూడా గుర్తించలేకపోయారని అన్నారు.

కేజ్రీవాల్ ఇంటికి ఢిల్లీ పోలీసులు

మరోవైపు ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడికేసులో ఢిల్లీ పోలీసులు ఆదివారం సీఎం కేజ్రీవాల్ ఇంటికి వెళ్లారు. సీసీటీవీ డిజిటల్ వీడియో రికార్డర్‌తోపాటు పలు ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు., మలివాల్‌పై దాడి కేసులో బిభవ్ కుమార్‌ను ఢిల్లీలోని స్థానిక కోర్టు ఐదు రోజుల కస్టడీకి అప్పగించింది.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా: మలివాల్

ఆప్ చేపట్టిన ఆందోళనలను ఉద్దేశించి స్వాతి మలివాల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిర్భయకు న్యాయం చేయాలని ఒకప్పుడు పోరాటం చేసిన ఆప్ నేతలు.. ఇప్పుడు ఒక నిందితుడికి మద్దతుగా ఆందోళనలు చేస్తున్నారని అన్నారు.

బీజేపీకి 8 సార్లు ఓటేసిన యువకుడు!

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ఈసీ చర్యలు తీసుకోవాలి: అఖిలేశ్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఓ యువకుడు నిబంధనలకు విరుద్ధంగా బీజేపీకి ఏకంగా 8 సార్లు ఓటేసినట్టు చూపిస్తున్న వీడియో ఒకటి వైరల్‌గా మారింది. అతను ఫరూకాబాద్ బీజేపీ అభ్యర్థి ముకేశ్ రాజ్‌పుత్‌కు ఓ పోలింగ్ బూత్‌లో ఓటేసినట్టు వీడియోలో ఉన్నది. ఓటేసిన ప్రతిసారి ఆ యువకుడు చేతి వేళ్లతో లెక్క పెడుతూ సంకేతాన్ని చూపడం వీడియోలో కనిపిస్తున్నది. ఈ వీడియోను ఆ యువకుడే తీసినట్లు తెలుస్తున్నది. ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు కలిగించేలా జరిగిన ఈ ఘటనపై ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఈ వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. 'ఇది తప్పు అని భావిస్తే.. ఈసీ వెంటనే చర్యలు తీసుకోవాలి' అని కోరారు. బీజేపీ బూత్ కమిటీ ఒక లూట్ కమిటీ అని విమర్శించారు. ఇది మేల్కోవాల్సిన సమయమని కాంగ్రెస్ పేర్కొన్నది.

కేసు నమోదు చేసిన పోలీసులు

ఏఆర్‌వో ప్రతీత్ ఫిర్యాదు మేరకు యూపీ పోలీసులు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ వీడియో అంశాన్ని ఈసీ కూడా పరిగణనలోకి తీసుకొన్నది. తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించినట్టు యూపీ ఎన్నికల ప్రధానాధికారి తెలిపారు.

పోలైన ఓట్ల కచ్చితమైన వివరాల్లేవ్!

ఆర్టీఐ దరఖాస్తుకు ఈసీ సమాధానం

న్యూఢిల్లీ, మే 19: లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్యకు సంబంధించిన కచ్చితమైన సమాచారం తమ వద్ద లేదని కేంద్ర ఎన్నికల సంఘం తన ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానంగా చెప్పిందని పూనమ్ అగర్వాల్ అనే ఓ జర్నలిస్టు శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇదే ప్రశ్నతో రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారులకు ప్రత్యేక దరఖాస్తులు చేయాలని ఈసీ సూచించిందని తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో నాలుగు దశల పోలింగ్ వివరాలను ఈసీ వెల్లడించిందని, అయితే ఇప్పుడు తమ వద్ద సమాచారం లేదని చెబుతున్నదని అన్నారు. మరోవైపు పోలైన ఓట్ల వివరాలను తెలియజేసే 'ఫారం 17సీ'ను అప్‌లోడ్ చేసేందుకు కొంత సమయం తీసుకొంటామని సుప్రీంకోర్టుకు తెలిపిందని అగర్వాల్ తన పోస్టులో పేర్కొన్నారు.

బటన్ దూరంలో డాటా.. అయినా!

దీనిపై సంజీవ్ గుప్తా అనే మాజీ ఐఏఎస్ ఎక్స్‌లో స్పందిస్తూ.. ఈసీ తమను తాము కష్టపెట్టదలచుకోవాలని అనుకోవడం లేదా? అని అన్నారు. పోలింగ్ కేంద్రాలవారీగా ఓటర్లకు సంబంధించి ఫారం 17సీ డాటా ఎన్నికల సంఘానికి చెందిన ఎన్‌కోర్ వెబ్ ఆధారిత సాఫ్ట్‌వేర్‌లో నమోదు అవుతుందని పేర్కొన్నారు. ఒక్క బటన్‌ను నొక్కే దూరంలో సమాచారం అందుబాటులో ఉండగా.. పోలైన ఓట్లకు సంబంధించిన కచ్చితమైన వివరాలు తమ వద్ద లేవని ఎలా చెబుతారని ప్రశ్నించారు.

మౌంట్‌బాటెన్‌ను నేనే చంపా

44 ఏండ్ల తర్వాత ఐరిష్ కమాండర్ వెల్లడి

డబ్లిన్: భారత చివరి గవర్నర్ జనరల్ మౌంట్‌బాటెన్ హత్యపై 44 ఏండ్ల తర్వాత కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బాటెన్‌ను చంపింది తానేనని ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ మాజీ కమాండర్ మైఖేల్ హేస్ 'డెయిలీ మెయిల్' మీడియా సంస్థతో చెప్పారు. మౌంట్‌బాటెన్ హత్య కేసులో దోషిగా తేలి శిక్ష అనుభవించిన థామస్ మెక్‌మహోన్‌కు తాను కమాండింగ్ అధికారినని చెప్పారు. మౌంట్‌బాటెన్ పడవలో మెక్‌మహోన్ బాంబును పెట్టాడని, తానే ఆ పడవను పేల్చేశానని, చీఫ్ కమాండర్‌గా ఈ హత్యకు తానే ప్రణాళిక రచించానని హేస్ బయటపెట్టారు. తాను పేలుళ్లపై లిబియాలో శిక్షణ తీసుకున్నట్టు చెప్పారు. ఇంగ్లండ్‌లో నార్తర్న్ ఐర్లాండ్‌ను భాగంగా చేయడాన్ని వ్యతిరేకిస్తూ మౌంట్‌బాటెన్‌ను ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ హత్య చేసింది.

యూపీ వాసి ఖాతాలో 9,900 కోట్లు జమ!

లక్నో, మే 19: యూపీలోని బాదోహి వాసి భానుప్రకాశ్ తన బ్యాంక్ ఖాతాను చూసి తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. లక్ష, రెండు లక్షలు కాదు ఏకంగా 9,900 కోట్ల రూపాయలు తన ఖాతాలో జమవ్వడం చూసి షాక్ తిన్నాడు. వెంటనే తన ఖాతా ఉన్న బరోడా యూపీ బ్యాంక్‌కు వెళ్లి అధికారులకు ఈ విషయాన్ని తెలిపాడు. వారు కూడా అతని ఖాతాను పరిశీలించగా రూ.99,99,94,95,999.99 నిల్వ ఉండటాన్ని గుర్తించారు. సాంకేతిక కారణాల వల్ల ఆ మొత్తం అతని ఖాతాలో పడినట్టు గుర్తించి ముందు జాగ్రత్తగా అతని ఖాతాను స్తంభింప చేసి తప్పును సవరించారు. వాస్తవానికి భానుప్రకాశ్‌ది కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) లోన్ అకౌంట్ అని, కానీ కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా అతని ఖాతా నాన్ పెర్‌ఫార్మింగ్ అసెట్ (ఎన్‌పీఏ)గా మారిపోయిందని, దానిని సవరించామని బ్యాంక్ అధికారులు తెలిపారు. సకాలంలో దీని గురించి తమకు తెలియజేసిన ఖాతాదారుడు భానుప్రకాశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పైవేటులోనూ డ్రైవింగ్ లైసెన్స్!

- కేంద్రం కొత్త నిబంధనలు
- జూన్ 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, మే 19: డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఇక నుంచి ఆర్టీఓ కార్యాలయానికి డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరుకావాల్సిన అవసరం లేదు. ప్రైవేటు సంస్థలు కూడా డ్రైవింగ్ టెస్టులు నిర్వహించి, సర్టిఫికెట్‌లను జారీ చేయవచ్చు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు జారీ చేసింది. జూన్ 1 నుంచి ఈ నిబంధనలు అమలులోకి రానున్నాయి.

అన్ని నదుపాయాలూ ఉంటేనే..

ఫోర్ వీలర్ పరీక్ష నిర్వహించాలంటే ప్రైవేటు డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్‌కు కచ్చితంగా 3 ఎకరాల స్థలం ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించేందుకు కావాల్సిన అన్ని నదుపాయాలు ఉండాలి. ట్రైనర్లు కచ్చితంగా హైస్కూల్ విద్యను పూర్తి చేసుకొని, డ్రైవింగ్‌లో ఐదేండ్ల అనుభవం పొంది ఉండాలి. వీరికి బయోమెట్రిక్స్, ఐటీపై ప్రాథమిక అవగాహన ఉండాలి. నిబంధనల ప్రకారం ఈ అన్ని అర్హతలు ఉన్న ప్రైవేటు సంస్థలకు డ్రైవింగ్ టెస్టు చేసే అధికారాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది.

డ్రైవింగ్ శిక్షణకు..

డ్రైవింగ్ నేర్పించేందుకు కాలపరిమితికి సంబంధించి కూడా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. లైట్ వెహికిల్ ట్రైనింగ్‌ను కచ్చితంగా నాలుగు వారాల పాటు, కనీసం 29 గంటల పాటు శిక్షణ ఇవ్వాలి. ఇందులో ఎనిమిది గంటలు థియరీ, 21 గంటలు ప్రాక్టికల్ ఉంటుంది. హెవీ మోటార్ వాహనాల డ్రైవింగ్‌కు ఆరు వారాల పాటు కనీసం 39 గంటల ట్రెయినింగ్ ఇవ్వాలి. ఎనిమిది గంటలు థియరీ, 31 గంటలు ప్రాక్టికల్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది.

ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్‌కు ప్రమాదం

- తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని జోల్ఫా సమీపంలో దుర్ఘటన
- రైసీ వెంట విదేశాంగ మంత్రి
- ప్రతికూల వాతావరణంతో సహాయ చర్యలకు అంతరాయం

దుబాయ్, మే 19: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురైనట్టు ఆ దేశ అధికారిక మీడియా ఆదివారం ప్రకటించింది. అజర్‌బైజాన్ సరిహద్దులో ఇరు దేశాలు సంయుక్తంగా నిర్మించిన డ్యామ్ ప్రారంభోత్సవానికి వెళ్లిన అధ్యక్షుడు, తిరుగు ప్రయాణంలో తబ్రిజ్ నగరానికి వెళ్తుండగా ఆయన వెళ్తున్న హెలికాప్టర్ కూలినట్టు ఇరాన్ అధికారిక మీడియా తెలిపింది. భారీ పొగమంచు మధ్య పర్వత ప్రాంతాలను దాటుతుండగా హెలికాప్టర్ కుప్పకూలిందని ఇరాన్ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. అధ్యక్షుడి కాన్వాయ్‌లోని మరో రెండు హెలికాప్టర్లు గమ్యస్థానాన్ని సురక్షితంగా చేరుకున్నాయని, అధ్యక్షుడు రైసీ సహా ఇతరులు క్షేమంగా ఉన్నారన్నదానిపై అనుమానాలున్నాయని

అంతర్జాతీయ మీడియా పేర్కొన్నది. 'ఘటనాస్థలం నుంచి వస్తున్న సమాచారం అత్యంత ఆందోళనకరంగా ఉంది' అని స్థానిక అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని జోల్ఫా సమీపంలో ప్రమాద ఘటన చోటుచేసుకుందని మీడియా వెల్లడించింది. హెలికాప్టర్‌లో అధ్యక్షుడు రైసీతో పాటు విదేశాంగ మంత్రి అబ్దొల్లాహియాన్, అజర్ బైజాన్ గవర్నర్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నట్టు తెలిసింది. రెస్క్యూ బృందాలు ఘటనాస్థలానికి చేరుకున్నాయని, భారీ వర్షం, మంచు కురవటంతో సహాయక చర్యలు ముందుకు కదలటం లేదని ఇరాన్ హోంమంత్రి వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా రెగ్యులర్ టీవీ కార్యక్రమాలన్నీ ప్రభుత్వం నిలిపివేసింది.

ఎవరీ ఇబ్రహీం రైసీ?

ఇరాన్‌లో మతతత్వ పాలనకు గట్టి మద్దతుదారుగా రైసీ నిలిచారు. ఇరాన్ సుప్రీం అయతుల్లా ఖమేనీకి అత్యంత సన్నిహితుడు, ఆయనకు వారసుడిగా రైసీ గుర్తింపు పొందారు. 1988లో ఖైదీలను సామూహికంగా ఉరితీసినందుకు అమెరికా, ఇతర దేశాల నుంచి ఆయన ఆంక్షల్ని ఎదుర్కొంటున్నారు. గతంలో ఇరాన్ న్యాయవ్యవస్థను నడిపారు. 2021 అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థులందర్నీ పక్కకు తప్పించి, తక్కువ ఓటింగ్‌తో రైసీ గెలుపొందటం వివాదాస్పదమైంది. అధికారం చేపట్టినప్పటి నుంచి దేశంలో నైతిక చట్టాల్ని కఠినతరం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్ని ఉక్కుపాదంతో అణచివేశారు.

సీఐఎస్ఎఫ్ బలగాలు

న్యూఢిల్లీ, మే 19: పార్లమెంట్ భద్రతా బాధ్యతలను సోమవారం నుంచి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) చేపట్టనున్నది. పార్లమెంట్ కాంప్లెక్స్ వద్ద మోహరించిన 1,400 మంది సీఆర్‌పీఎఫ్ భద్రతా సిబ్బందిని ఉపసంహరించుకోనున్నారు. కొత్త, పాత పార్లమెంట్ కాంప్లెక్స్‌ల భద్రతా వ్యవహారాలను ఇకపై సీఐఎస్ఎఫ్ పర్యవేక్షించనున్నది. గత ఏడాది డిసెంబర్ 13న ఇద్దరు ఆగంతకులు పార్లమెంట్‌లో చొరబడి గందరగోళం సృష్టించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భద్రతా వ్యవహారాలను సీఆర్‌పీఎఫ్ నుంచి సీఐఎస్ఎఫ్‌కి అప్పగించిన సంగతి తెలిసిందే.

కొత్త క్రిమినల్ చట్టాలపై నేడు సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ, మే 19: ప్రస్తుతం అమలులో ఉన్న నేర చట్టాలను ప్రక్షాళన చేస్తూ, కేంద్రం తీసుకొచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం విచారించనుంది. కేంద్రం గత ఏడాది డిసెంబర్ 21న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలను ప్రవేశపెట్టగా పార్లమెంట్ వాటిని ఆమోదించింది. అయితే పార్లమెంట్‌లో సమగ్ర చర్చ చేపట్టకుండా ఈ బిల్లులను ఆమోదించారని, దీనిపై స్టే విధించాలని న్యాయవాది విశాల్ తివారీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఒక నిపుణుల కమిటీని వేయాలని కోరారు.

మోదీకి ఓటేయొద్దన్న టీచర్‌కు జైలు

పట్నా, మే 19: ప్రధాని మోదీకి ఓటేయవద్దని పిల్లలకు చెప్పిన ఓ స్కూల్ టీచర్‌కు ఊహించని షాక్ తగిలింది. బీహార్ ముజఫర్‌పూర్‌లో పోలీసులు స్కూల్ టీచర్‌ను అరెస్టు చేసి.. జైలుకు పంపారు. ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించాడంటూ జిల్లా విద్యాధికారి ఫిర్యాదు చేయగా, సదరు టీచర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. 'కుర్హాని బ్లాక్‌లోని అమ్రాఖి ప్రభుత్వ స్కూల్‌లో టీచర్ హరేంద్ర రాజక్‌పై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ అధికారిగా ఓ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్ని ప్రభావితం చేసేందుకు టీచర్ ప్రయత్నించాడని డీఈవో అన్నారు. అతడిపై చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

రోదసిలోకి తెలుగు వ్యక్తి

- బ్లూ ఆరిజిన్ మిషన్ ద్వారా నింగిలోకి గోపీచంద్ తోటకూర
- మొదటి భారతీయ అంతరిక్ష పర్యాటకుడిగా రికార్డు

వాషింగ్టన్, మే 19: తెలుగు యువకుడు గోపీచంద్ తోటకూర అరుదైన ఘనత సాధించారు. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయ పర్యాటకుడిగా గుర్తింపు పొందారు. బ్లూ ఆరిజిన్ ఎన్ఎస్ 25 మిషన్ ద్వారా ఆయన ఆదివారం అంతరిక్షంలోకి వెళ్లి సురక్షితంగా తిరిగొచ్చారు. పశ్చిమ టెక్సాస్ నుంచి ఆరుగురు సభ్యులతో తమ ఏడో మానవ సహిత వ్యోమ నౌక(న్యూ షెపర్డ్) రోదసిలోకి వెళ్లినట్టు బ్లూ ఆరిజిన్ సంస్థ సోషల్ మీడియాలో ప్రకటించింది. పర్యటన తర్వాత వీరు వెళ్లిన కాప్సూల్ పారాచూట్ సాయంతో తిరిగి భూమి మీదకు చేరుకుంది. భూవాతావరణం, అంతరిక్ష సరిహద్దుగా భావించే కర్మన్ రేఖ ఎగువకు, భూవాతావరణం నుంచి 105.7 కిలోమీటర్ల ఎత్తుకు ఈ వ్యోమనౌక వెళ్లి వచ్చింది. అక్కడ కొన్ని నిమిషాల పాటు వీరు భారరహిత స్థితిని

అనుభూతి పొంది తిరిగొచ్చారు. అంతరిక్ష పర్యటన కోసం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ బ్లూ ఆరిజిన్‌ను స్థాపించిన సంగతి తెలిసిందే.

ఎవరీ గోపీచంద్?

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన గోపీచంద్ అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడే పైలట్ శిక్షణ తీసుకున్నారు. పలు కమర్షియల్ జెట్లు, స్కైప్లేన్లు, ఎయిర్ అంబులెన్స్‌లకు పైలట్‌గా వ్యవహరించారు. తర్వాత ఆయన అట్లాంటాలో ప్రిజర్వ్ లైఫ్ కార్ప్ అనే వెల్‌నెస్ కేంద్రాన్ని స్థాపించారు. 1984లో రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా, తొలి భారతీయ అంతరిక్ష పర్యాటకుడిగా గోపీచంద్ చరిత్రకెక్కారు.

అంత్యక్రియల ఖర్చు 30 లక్షలు!

- భరించలేక మృతదేహాల్ని వదిలేస్తున్న కుటుంబసభ్యులు
- కెనడాలో దయనీయ పరిస్థితులు
- పెరుగుతున్న అనాథ మృతదేహాలు

ఒట్టావా: తమ వారి అంత్యక్రియలను గౌరవంగా జరిపించి తుది వీడ్కోలు పలకాలని ప్రతి కుటుంబం అనుకుంటుంది. కానీ, కెనడాలో మాత్రం కొన్ని కుటుంబాలు అయిన వారి మృతదేహాలను అనాథ శవాలుగా వదిలేసే దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. భారీగా పెరిగిన అంత్యక్రియల ఖర్చులను భరించలేక మృతులు తమ వారేనని తెలిసినా మృతదేహాలను తీసుకోవడం లేదు. దీంతో దేశంలోని అన్ని ప్రావిన్సుల్లో అనాథ మృతదేహాల సంఖ్య పెరుగుతున్నది. అంటారియో ప్రావిన్సులో 2013లో 242 అనాథ మృతదేహాలను గుర్తించగా, 2023లో 1,183 గుర్తించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మృతుల వద్ద ఉన్న ఆధారాలతో కుటుంబసభ్యులను గుర్తించినా.. అంత్యక్రియల ఖర్చులు భరించలేక 2023లో 24 శాతం మృతదేహాలను తీసుకెళ్లలేదు. శ్మశాన వాటికల్లో మృతదేహాల ఖననానికి భారీగా డబ్బు చెల్లించాల్సి వస్తున్నది. అంత్యక్రియల ప్రక్రియకు కూడా ఖర్చులు పెరిగిపోయాయి. ఒక్కో ప్రాంతంలో ఈ ఖర్చు ఒక్కోలా ఉంది. గ్రేటర్ టొరంటో నగరంలో అయితే అంత్యక్రియల ఖర్చు దాదాపుగా 34 వేల డాలర్లు అవుతున్నది. అంటే, మన కరెన్సీలో అక్షరాల రూ.27 లక్షల